
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

బుధవారం 30 జూలై 2025

కమీషన్ల కోసం ఆంధ్రవాళ్లకు కాంట్రాక్టులు ఇచ్చింది కేసీఆర్

- కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్

సిరిసిల్ల టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ కమీషన్ల కోసం ఆంధ్రవాళ్లకు ప్రాజెక్టులు, ఇతరత్రా కాంట్రాక్టు పనులను ఇచ్చాడని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రగతి భవన్‌లో నాటి ఆంధ్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని విందుకు పిలిచి గోదావరి మిగులు జలాలను తరలించి రాయలసీమను రత్నాల సీమగా మారుస్తానని కేసీఆర్ అన్నది బీఆర్ఎస్ నాయకులు మరిచిపోయారన్నారు. వీటన్నింటిని మరిచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆంధ్రవాళ్లకు తెలంగాణను తాకట్టు పెడుతున్నాడంటూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పారదర్శకంగా ప్రభుత్వం పరంగా ఏ అభివృద్ధి పనులైన టెండర్ల ద్వారనే ప్రక్రియను నిర్వహిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పాలనలో కాళేశ్వరం, మెడికల్ కళాశాల పనులు తెలంగాణ వారికి ఇస్తే కమీషన్లు తక్కువ వస్తాయని ఆంధ్రా కాంట్రాక్టర్లకు ఇచ్చారని ఆరోపించారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మాజీ కౌన్సిలర్లు కుడికాల రవికుమార్, వేముల రవి, కత్తెర దేవదాస్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, నాయకులు నల్ల శ్రావన్, గుండ్లపెల్లి గౌతమ్, చెన్నమనేని కమలాకర్, భీమవరపు శ్రీనివాస్, వంతడపుల రాము, చందన పాల్గొన్నారు.



చిన్నారులకు 'ప్రీ ప్రైమరీ'

- జిల్లాలోని 13 పాఠశాలల్లో విద్య బోధనకు ఏర్పాట్లు..
- పుస్తకాలు, ఇతర సామగ్రికి ఒక్కో విద్యార్థికి రూ.500 ఖర్చు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ తరహాలో విద్యాబోధన అందించే దిశగా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇప్పటికే డిజిటల్ తరగతి గదులు, ఏఐక్లాసులు, ఆధునిక సౌకర్యాలతో తరగతి గదులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు ప్రీ ప్రైమరీ బోధన అందించడానికి ఏర్పాట్లు చేస్తోంది. దీంతో పేద, మధ్యతరగతి వర్గాలకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యాభారం తప్పుతుంది. యూకేజీ వరకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు చెల్లించి చదివించే పరిస్థితి రానున్నరోజుల్లో తొలగిపోతుందని భావిస్తున్నారు. ఇప్పటికే రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ విద్య అందిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలో కూడా ప్రీ ప్రైమరీ విద్య అందించడంపై పేద, మధ్యతరగతి కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

● జిల్లాలో తొలి విడతలో 13 ప్రీ ప్రైమరీ పాఠశాలలు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో తొలి విడతగా 13 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ విద్యకోసం ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో గతంలో ప్రభుత్వ సహకారంతో 31 పాఠశాలలో పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో ప్రీ ప్రైమరీ విద్య అందించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 626ఉన్నాయి. గత విద్యాసంవత్సరం 82,636మంది విద్యార్థులు చదువుకున్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 50,516మంది, ప్రైవేట్‌పాఠశాలల విద్యార్థులు 32,120 మంది ఉన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలకు దీటుగా సర్కారు పాఠశాలల్లో విద్యను అందించడానికి పకడ్బందీగా విద్యాసంవత్సరం అకడమిక్ క్యాలెండర్‌ను విద్యాశాఖ విడుదల చేసింది. కానీ జిల్లాలోని చాలా వరకు స్కూల్స్‌లో పాటించడం లేదు. విద్యాబోధనతో పాటు యాక్టివిటీలకు ప్రాధాన్యతనిస్తూ విద్యా సంవత్సరంలో పాఠశాలలు 230పని దినాలను నిర్ణయించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా సిలబస్ పూర్తిచేయడానికి గడువు పెట్టింది. ప్రతిరోజు పాఠశాలకు విద్యార్థులు 90శాతం హాజరయ్యేలా ఉపాధ్యాయులు తగిన చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్యను గణనీయంగా పెంచడానికి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి. విద్యార్థులు ఏకాగ్రత పెంచడంతోపాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే దిశగా చర్యలు చేపట్టాలి. ప్రతిరోజు ఐదునిమిషాల పాటు యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని క్యాలెండర్లో పేర్కొన్నారు. పాఠశాలలోని ప్రతి విద్యార్థితో 30 నిమిషాల పాటు చదివించాలి. రీడింగ్ యాక్టివిటీలో పాఠ్యపుస్తకాలతో పాటు కథల పుస్తకాలు దిన పత్రికలు వంటి వాటిని చదివించాలి. ప్రతినెలా మూడవ శనివారం బ్యాగ్‌లెస్‌డేగా పాటించాలి. కానీ అకాడమిక్ క్యాలెండర్‌పై నిర్లక్ష్యమే కనిపిస్తుంది. ప్రీ ప్రైమరీ బోధన పద్ధతులు ఆసక్తికరంగానే రూపొందిస్తున్నారు.

● ఆటపాటలతో బోధన..

జిల్లాలో నూతనంగా ప్రారంభించనున్న ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో చిన్నారులు ఆకట్టుకునే విధంగా రకరకాల సామగ్రితో ఆటపాటలతో విద్యాబోధన చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఎంపిక చేసిన పాఠశాలలో తరగతి

- మిగతా 8లో

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



సుందరయ్యనగర్ పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న కలెక్టర్

సిరిసిల్ల టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ దవాఖానలకు వచ్చే రోగులకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పిస్తూ మెరుగైన వైద్య సేవలను అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వైద్యులను సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులు, వార్డులు, మందులను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులతో మాట్లాడారు. వైద్య సేవలపై రోగులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో ఊడిన సీసీ కెమారాను సరి చేయించాలని, ఆస్పత్రి ఆవరణలో గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయించాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు వ్యక్తిగత పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. జ్వరం, అనారోగ్య సమస్యలు వస్తే ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు పొందాలని అన్నారు. కలెక్టర్ వెంట ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత లేకుండా చూడాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు

సిరిసిల్ల టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలకు ఇసుక కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పేదవారికి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఏఐటీయూసీ స్వాగతిస్తోందన్నారు. ఇసుక, మట్టి కొరతతో చాలా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోతున్నాయని, ప్రతిరోజు ఇసుక, మట్టి తీసుకోవడానికి అధికారులు అనుమతినివ్వాలని కోరారు. అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని, ప్రతి పేదోడికి ఇంటి కల నేరవేరుతుందన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, నాయకులు పంతం రవి, కోరేపు క్రాంతి పాల్గొన్నారు.

మాదిగల ఆత్మీయ సమ్మేళన సభ వాయిదా

సిరిసిల్ల టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ఈనెల 30న జరిగాల్సిన మాదిగల ఆత్మీయ సమ్మేళన సభ వాయిదాపడిందని మాదిగల ఐక్య వేదిక కోర్ కమిటీ సభ్యులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సభ ఈనెల 30న జిల్లా కేంద్రంలో జరగాల్సి ఉందని, మంత్రి అడ్లూరి లక్ష్మన్‌తో పాటు ఎమ్మెల్యేలు ఢిల్లీకి వెళుతున్నందున వాయిదా వేశామన్నారు. జిల్లాలోని మాదిగ నాయకులు గమనించాలని, తిరిగి సమ్మేళన సభ తేది వివరాలను వెల్లడిస్తామన్నారు. సమావేశంలో సభ్యులు కత్తెర దేవదాస్, కొట్టిపెల్లి సుధాకర్, అంకని భాను, ప్రభాకర్, నారాయణ, రాము, దేవయ్య పాల్గొన్నారు.

తంగళ్లపల్లి పీహెచ్‌సీ తనిఖీ..

తంగళ్లపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి రజిత తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని ఆరోగ్యం మహిళ క్లినిక్‌లోని రికార్డులను పరిశీలించారు. మహిళలకు రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్‌లపై అవగాహన కల్పించారు. ఇందిరనగర్‌లో ఇంటింటి సర్వే డ్రైడే పరిశీలించారు. మలేరియాప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత, సూపర్‌వైజర్ లింగంలు ఉన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

వీర్నపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాశిగుట్ట తండాలో శానిటేషన్ పనులు, వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేను ఎంపీడీవో బీర్ల బీరయ్య మంగళవారం పరిశీలించారు. పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కాగా, రాశిగుట్ట తండాలో ఇంటింటా తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించి, 8 మంది జ్వరపీడితుల నుంచి రక్తాన్ని సేకరించి ల్యాబ్‌కు పంపించారు. హెల్త్‌అసిస్టెంట్ రమేష్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల తనిఖీ

ఎల్లారెడ్డిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య సమన్వయ అధికారి పెంచలయ్య మంగళవారం తనిఖీ చేశారు. వెంట సూపరిండెంట్ రఘు, వైద్యులు ప్రదీప్‌కుమార్, ఓంకార్, సిబ్బంది నాగరాజు, వినయ్‌కుమార్, రంజిత్ ఉన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట సామాజిక ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి పెంచలయ్య మంగళవారం ఆకస్మీకంగా తనిఖీ చేశారు. వీరి వెంట వైద్యులు సింధు, సుష్మ, నాగరాజు, రంజిత్ ఇతర వైద్య సిబ్బంది ఉన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



గోశాలలోని కోడెలకు పచ్చగడ్డి వేస్తున్న ఆది శ్రీనివాస్ 7

కేంద్రీయ విద్యాలయం నూతన భవనం ప్రారంభం

- వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న అనురాధ 7

పేద విద్యార్థులకు మెరుగైన విద్య

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి రూ.9.20 కోట్ల మహిళ హాస్టల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఎన్నికైన మొదటిసారిగా డిగ్రీ కళాశాలను సందర్శించిన సందర్భంగా హాస్టల్‌వసతి లేకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులను గమనించి సీఎం దృష్టికి తీసుకవెళ్లానన్నారు. విద్యపై ప్రభుత్వానికి ఉన్న ప్రాముఖ్యత, పేదలు చదువుకునే పాఠశాలలు, కళాశాల లు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం కల్పిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం హాస్టల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. 2005లో అగ్రహారం డిగ్రీ కళాశాల లో సైన్స్ వింగ్ ఏర్పాటు కోసం అప్పటి సీఎం వైఎస్ రాజాశేఖర్‌రెడ్డి సహకారంతో ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. హాస్టల్ వసతి కారణంగా ఎక్కువ మంది బాలికలు ఉన్నత చదువులు చదవుకుంటారని పేర్కొన్నారు. రెసిడెన్షియల్ విద్యార్థులు చదువుకునే పేద పిల్లల కోసం ప్రజా ప్రభుత్వం 40శాతం డైట్ చార్జీలు, 200శాతం కాస్మెటిక్ చార్జీలు పెంచామన్నారు. పేద పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని లక్ష్యంతో కామన్ డైట్ మెన్యూ ప్రవేశపెట్టామన్నారు. నూతనంగా 11 వేల టీచర్ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేసి ప్రభుత్వ పాఠశాలలో నియమించామన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన బదిలీలు పదోన్నతులు పారదర్శకంగా చేశామన్నారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకుని వస్తున్నామని, ఐటీఐ కళాశాలను రతన్ టాటా కంపెనీతో అనుసంధానం చేసుకుని అడ్వాన్స్ ట్రేడ్ సెంటర్లుగా మారుస్తున్నామని తెలిపారు. రూ. 200 కోట్లు ఖర్చు చేసి 20 నుంచి 25 ఎకరాల స్థలంలో యంగ్ ఇండియా సమీకృత గురుకుల నిర్మాణ పనులు ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. వేదాలకు సంబంధించిన ఆల్ ఇండియా పరీక్షలు రాజన్న ఆలయంలో నిర్వహించామని, భవిష్యత్తులో మరిన్ని విద్యా సంస్థలను వేములవాడ ప్రాంతంలో ఏర్పాటుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామని హామీచ్చారు. కలెక్టర్ సందీప్‌కుమార్ మాట్లాడుతూ నాగ పంచమి రోజు పీఎం ఉష పథకం క్రింద రూ.9 కోట్ల 20 లక్షలతో అగ్రహారం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద హాస్టల్ భవన నిర్మాణానికి భూమి పూజ చేయడం సంతోషంగా ఉందని అన్నారు. 18 నెలల్లోనే భవన నిర్మాణ పనులు పూర్తి చేసి విద్యార్థినులకు అందుబాటులోకి తీసకువస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అధ్యాపకులు, విద్యా ర్థులు పాల్గొన్నారు.



హాస్టల్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్, కలెక్టర్

రైతులకు ఉత్తమ సేవలు అందించాలి : కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఇన్‌పుట్ డీలర్ డిప్లమా కోర్సులు పూర్తిచేసుకున్న అభ్యర్థులు ఉత్తమ సేవలను అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం కోర్సు పూర్తిచేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికేట్‌లను కలెక్టర్ అందించారు. డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్(డీఏఈఎస్ఐ) కోర్సులను జిల్లాలోని 40 మంది అభ్యర్థులు పూర్తి చేసుకున్నారు. వీరందరిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్‌ని కలిసిన విప్

వేములవాడ టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం హాజరయ్యారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌ను మర్యాద పూర్వకంగా ఆది శ్రీనివాస్ కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర, వేములవాడ నియోజకవర్గ అభివృద్ధితో పాటు రాజకీయంగా పలు అంశాలను చర్చించినట్లు పేర్కొన్నారు. ఆమెను కలిసిన వారిలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఉన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు సహకారం

సిరిసిల్ల టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మహిళా స్వావలంబనకు మహిళకు అన్ని విధాలుగా సహకరిస్తాం అని మున్సిపల్ కమీషనర్ ఖదీర్ పాషా అన్నారు. మంగళవారం సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల ద్వారా ఉత్పత్తి చేసిన వస్తువుల స్టాల్స్‌ను మున్సిపల్ కమిషనర్ సందర్శించారు. మెప్మా టీఎంసీలు మహాలక్ష్మి, శ్రీమతి, సుగుంధ, డీఎంసీ రాజేశం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లుకు బీజేపీ వ్యతిరేకం..

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు



సిరిసిల్లలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు

సిరిసిల్ల రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ బిల్లుకు బీజేపీ వ్యతిరేకమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు విమర్శించారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో మంగళవారం సీపీఎం జిల్లా కమిటీ సమావేశం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎగుమంటి ఎల్లారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ సిరిసిల్లలో లక్షలాది మంది కార్మికులకు ఉచిత వైద్యం అందించేందుకు మంజూరైన ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణాలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ స్పందించి ప్రజలకు జవాబు చేప్పాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ కుమార్ మతవిద్వేషాలు రెచ్చగొట్టే ప్రసంగాలే కానీ జిల్లా ప్రజల సమస్యలు పరిష్కారంపై శ్రద్ధ చూపడం లేదన్నారు. బీసీ బిల్లు విషయంలో బీజేపీ బలహీన వర్గాలకు బద్ధశత్రువుగా వ్యవహరిస్తోందన్నారు. బలహీన వర్గాలపై చిత్తశుద్ధి ఉంటే తక్షణమే పార్లమెంట్‌లో బీసీ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రైతాంగానికి యూరియా కొరత ఏర్పడిందని, దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర ఆరోపణలతో సమస్య పరిష్కారం చేయకుండా పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలన్నారు. సిరిసిల్లలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరతను సృష్టించి లబ్ధిదారులను ఇబ్బందులు పెడుతున్నారని,అధిక ధరలకు ఇసుకను విక్రయిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో 16ముంపు గ్రామాల ప్రజలు కలిసి మౌలిక సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించి ఉపాధిని కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిరిసిల్లలో వర్కర్ టూ ఓనర్ పథకానికి మోక్షం ఎప్పుడని ప్రశ్నించారు. జిల్లాలో 8,800ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని, అందులో 5వేల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని, వాటికి నిధులు కేటాయించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు అందించాలన్నారు. జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో సర్వేలు చేపడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి మూషం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జవ్వాజి విమల, కోడం రమణ, మల్లారపు అరుణ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు గన్నేరం నర్సయ్య, ఎర్రవెల్లి నాగరాజు, సూరం పద్మ, మాల్లారపు ప్రశాంత్, గురజాల శ్రీధర్, శ్రీరాముల రమేష్‌చంద్ర, ప్రజా సంఘాల నాయకులు గాంతుల మహేష్, నక్క దేవదాస్, గుండేటి పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు వ్యాగన్‌పై తెగిపడిన హైటెన్షన్ వైరు



ఆగి ఉన్న బొగ్గు వ్యాగన్‌పై పడిన హై టెన్షన్ వైరు

పెద్దపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లోని మూడో ప్లాట్ ఫారంపై ఆగి ఉన్న బొగ్గు వ్యాగన్‌పై మంగళవారం హైటెన్షన్ వైరు తెగిపడింది. అయితే ఆ వైరు వ్యాగన్‌లో ఎత్తుగా ఉన్న బొగ్గు మీదనే పడడంతో ప్రమాదం తప్పింది. ఈ వైరు ప్రయాణికులతో వెళ్లే రైళ్లపై పడి ఉంటే పెను ప్రమాదం సంభవించి ఉండేది. విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు యుద్ధప్రాతిపదికన తెగిపడిన హైటెన్షన్ వైరును తొలగించారు. రైళ్ల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

- చికిత్స పొందుతూ మృతి


సదానందం (ఫైల్)

సైదాపూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని సోమారం గ్రామానికి చెందిన దాసారపు సదానందం(53) అనే గీత కార్మికుడు వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సదానందం ఈనెల 15న సాయంత్రం వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కుతుండగా కాలు జారీ కింద పడిపోయాడు. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని సదానందంను హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి డాక్టర్లు సదానందం వెన్నుపూస విరిగిందని ఆపరేషన్ చేయలేమని చెప్పగా అక్కడి నుంచి ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడు సదానందం కుమారుడు రంజిత్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

గంజాయి పట్టివేత.. ముగ్గురి అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల వద్ద రహదారిపై మంగళవారం రెండున్నర కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి వివరాల ప్రకారం... ఇరుకుల్ల వద్ద ఎస్సై లక్ష్మారెడ్డి వాహనాలు తనిఖీ చేస్తున్నారు. కరీంనగర్ నుంచి పెద్దపల్లి వైపు రెండు బైక్‌లపై వెళుతున్న యువకులు పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులు పట్టుకున్నారు. బైక్‌లను తనిఖీ చేయగా నిషేధిత గంజాయి పట్టుబడింది. విచారించగా భద్రచలం అటవీ ప్రాంతం నుంచి గంజాయిని కొనుగోలు చేసి కరీంనగర్‌కు తీసుకొస్తున్నట్లు, మొగ్ధుంపూర్, కరీంనగర్ శివారులోని విద్యాసంస్థల్లో యువతకు విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. నిందితులు మొగ్ధుంపూర్ గ్రామానికి చెందిన బుర్ర వంశీ(22), దుర్గం హరికృష్ణ(22), సుల్తానాబాద్ మండలం పూసాలకు చెందిన పూసల సాయి(21), మరో బాలుడిపై కేసు నమోదు చేశామని సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. నిందితుల వద్ద నుంచి నాలుగు మొబైల్ ఫోన్‌లు, రెండు ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నామని, నిందితులను కోర్టులో హాజరుపరిచామని పేర్కొన్నారు.

పశుగ్రాసం క్షేత్రాల ఏర్పాటుకు ప్రోత్సాహం



- ఉపాధిహామీ పథకంతో భరోసా
- కొరతను అధిగమించేందుకు రాయితీపై విత్తనాలు

కరీంనగర్ రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమ ప్రధానమైంది. మూగజీవాలకు సరైన గ్రాసం లభించక ఆ ప్రభావం వాటి ఆరోగ్యం, పాల ఉత్పత్తిపై పడుతుంది. దీన్ని అధిగమించేందుకు ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో వంద శాతం రాయితీపై బహు వార్షిక పశుగ్రాస క్షేత్రాల ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. అర్హులైన పశువుల పెంపకం దారులకు గ్రాసం విత్తనాలను రాయితీపై సరఫరా చేస్తారు. ఐదు ఎకరాల్లోపు వ్యవసాయ భూమి ఉన్న సన్నచిన్నకారు రైతులకు ఈ పథకం వర్తిస్తుంది. కరీంనగర్ రూరల్ మండలంలో మొత్తం 2,142 ఆవులు, 4,296 గేదెలు, 4,437 మేకలు, 34,378 గొర్రెలు ఉన్నాయి. ఉపాధిహామీ జాబ్ కార్డు, సాగు భూమి, నీటి సౌకర్యం ఉన్న వారు ఈ పథకానికి అర్హులు. భూమి పత్రాలు, బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్, రేషన్ కార్డుతో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి కలిగిన వారు ఎంపీడీవోను సంప్రదిస్తే ఉపాధిహామీ పథకం అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారు. అంచనాలు రూపొందించిన తర్వాత పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో సంబంధిత ఉద్యోగులు రైతులకు పశువులు ఉన్నాయో లేదో నిర్ధారించి నిధులు విడుదల చేస్తారు.

గరిష్ఠంగా 5 గుంటల విస్తీర్ణంలో..

ఒక్కో రైతు ఒక గుంట నుంచి 5 గుంటల విస్తీర్ణంలో పశు గ్రాసం పెంచుకోవచ్చు. ఒక గుంటలో పెంచే వారికి వేతనంగా రూ.3వేలు, సామగ్రి కింద రూ.3,599, 5 గుంటల విస్తీర్ణంలో అయితే గరిష్ఠంగా కూలీ వేతనం కింద రూ.15వేలు, సామగ్రికి 17,992 రూపాయలు అందజేస్తారు. ఆసక్తి ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం భరించలేక ఈనెల 26న ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని దుమాలకు చెందిన పిల్లి మానస (38) అనే మహిళ మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. జగ్గరావుపల్లికి చెందిన మృతురాలి తండ్రి పెరుమాండ్ల పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రాహుల్ రెడ్డి వివరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కరీంనగర్ విద్యానగర్‌కు చెందిన దయ్యాల తిరుపతి(35) మంగళవారం మృతి చెందినట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు. బీటెక్ పూర్తిచేసిన తిరుపతి మానసిక సమస్యతో బాధపడుతూ ఇంటి వద్దనే ఖాళీగా ఉంటున్నాడు. తనకు మానసిక సమస్య నయం కాదని మనస్తాపంతో ఇంట్లో గడ్డి మందు తాగాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిలో బాలింత మృతి

- ఆరు రోజుల క్రితం ప్రసవం - ఇంజక్షన్ వికటించడంతోనే మృతి చెందిందని బంధువుల ఆరోపణ


పెద్దపల్లి ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు, ఇన్‌సెట్‌లో మృతురాలు ఉమాదేవి (ఫైల్)

పెద్దపల్లి టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిలో పాపకు జన్మనిచ్చిన తల్లి ఆరు రోజుల తర్వాత అకస్మాత్తుగా అస్వస్థతకు గురై మృతి చెందింది. ఇంజక్షన్ వికటించడం వల్లనే మృతి చెందిందని బంధువులు ఆరోపిస్తున్నారు. పెద్దపల్లి పట్టణం తెనుగువాడకు చెందిన గర్భిణి మత్తమర్రి ఉమాదేవి (28) ఈనెల 22న చెకప్ కోసం ఆసుపత్రికి రాగా నొప్పులు వచ్చే అవకాశాలున్నాయని అడ్మిట్ చేసుకున్నారు. మరుసటి రోజు ఆపరేషన్ చేయడంతో పాపకు జన్మనిచ్చింది. మంగళవారం ఉదయం ఆమెకు ఒంటిపై దురద రావడంతో డాక్టర్లు ఇంజక్షన్ ఇచ్చారు. ఇంజక్షన్ ఇచ్చిన అరగంట తర్వాత చర్మంపై దద్దుర్లు వచ్చి శరీరం ఉబ్బడంతో ఆందోళనకు గురయ్యారు. వెంటనే 2డీ ఎకో చేయగా గుండె వేగం తగ్గడంతో డాక్టర్లు కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మార్గమధ్యలోనే మృతి చెందిందని పేర్కొన్నారని బంధువులు తెలిపారు. కరీంనగర్‌లో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని సాయంత్రం పెద్దపల్లికి తీసుకువచ్చారు. ఉమాదేవి మృతదేహం రాత్రి పెద్దపల్లి పట్టణానికి చేరుకున్న తర్వాత ఆసుపత్రి వద్దకు బంధువులు చేరుకుని ఆందోళన నిర్వహించారు. ఇంజక్షన్ వికటించడం వల్లనే ఉమాదేవి మృతి చెందిందని, డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మృతురాలి బంధువులు మంగళవారం రాత్రి ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు ఆసుపత్రి ఎదుట బందోబస్తు నిర్వహించారు. కాగా వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహించిన డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శౌరయ్యలపై చర్యలు తీసుకోవాలని ఉమాదేవి భర్త హరీష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలీస్ శాఖలో జాగిలాల విభాగం కీలకం

కరీంనగర్ సీపీ గౌస్ ఆలం


పోలీసు జాగిలాలను సన్మానిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో జాగిలాల విభాగం చాలా కీలకమైనదని సీపీ గౌస్ ఆలం అన్నారు. పోలీస్ కమిషనరేట్‌లో దశాబ్ద కాలంపైగా సేవలు అందించిన పోలీస్ జాగిలాలు డానీ (డాబర్మాన్), టైగర్(జర్మన్ షెపర్డ్) మంగళవారం ఉద్యోగ విరమణ పొందాయి. ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆధ్వర్యంలో అస్త్ర కన్వెన్షన్‌లో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. డానీ(10 సంవత్సరాలు), టైగర్ (11 సంవత్సరాలు) డాగ్ స్క్వాడ్ విభాగంలో విశేష సేవలందించాయి. ముఖ్యంగా దొంగతనాలు, హత్య కేసుల్లో ట్రాకర్ డాగ్‌లుగా కీలక పాత్ర పోషించాయి. 2014లో టైగర్, 2015లో డానీ పోలీసుశాఖలో చేరాయి. ఈ జాగిలాలను సీపీ సన్మానించారు. టైగర్‌కు హ్యాండ్లర్‌గా వ్యవహరించిన కానిస్టేబుల్ మహేందర్, డానీకి హ్యాండ్లర్‌గా వ్యవహరించిన కానిస్టేబుల్ మురళిని అభినందించారు. సీపీ మాట్లాడుతూ నేరస్థులను పట్టుకోవడంలో, పేలుడు పదార్థాలు, మత్తుపదార్థాలను గుర్తించడంలో పోలీస్ జాగిలాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయని తెలిపారు. అదనపు డీసీపీలు వెంకటరమణ, భీం రావు, ఆర్‌ఐ రజినీకాంత్ ఉన్నారు.

ఆరుగురి బైండోవర్

జగిత్యాల క్రైం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నేరాల అదుపు కోసం పాత కేసుల్లో ఉన్న ఆరుగురు వ్యక్తులను మంగళవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు టౌన్ సీఐ కరుణాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణానికి చెందిన వినీత్ సాయి, దీక్షిత్, మల్లికార్జున్, రాజ్ కుమార్, వినయ్, పూరెల్ల వినయ్ భవిష్యత్‌లో నేరాలకు పాల్పడకుండా ఉండేందుకు బైండోవర్ చేసినట్లు తెలిపారు.

20 మందికి జరిమానా

ఎల్లారెడ్డిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన వాహన తనిఖీల్లో మద్యం తాగి పట్టుబడిన 20 మందిని సిరిసిల్ల న్యాయస్థానంలో హాజరుపర్చగా న్యాయవాది జయశ్రీ జరిమానా విధించారని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. 16 మంది ద్విచక్ర వాహనదారులు, ఒకరు ఆటో డ్రైవర్, ముగ్గురు కారు నడిపిన వ్యక్తులున్నారని ఎస్‌ఐ పేర్కొన్నారు.

లైఫ్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలకు రేపు చివరి తేదీ

గణేశ్‌నగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) లైఫ్ సైన్సెస్‌లో ప్రవేశాలకు గురువారం వరకు మాత్రమే అవకాశం ఉందని అడ్మిషన్స్ ఇన్‌చార్జి డాక్టర్ కె. కిరణ్మయి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైనవారు కళాశాలలో సంప్రదించాలని సూచించారు. బాటనీ, జువాలజీ, కెమిస్ట్రీతో పాటు ఫిషరీస్, క్రాప్ ప్రొడక్షన్, ఫుడ్ సైన్స్, మైక్రో బయాలజీ, బయోటెక్నాలజీ, బయో కెమిస్ట్రీ కోర్సులు ఉన్నట్లు వివరించారు.

వీధి కుక్కల దాడిలో నాటు కోళ్లు మృతి


షెడ్డులో మృతిచెంది ఉన్న నాటు కోళ్లు

గంభీరావుపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం నర్మాలలో వీధి కుక్కల దాడిలో 200లకు పైగ నాటు కోళ్లు మృత్యువాత పడ్డాయి. నర్మాల గ్రామానికి చెందిన పిట్ల నర్సింలు తన షెడ్డులో నాటు కోళ్లను పెంచుతున్నాడు. షెడ్డులోకి మంగళవారం ఉదయం కుక్కలు చొరబడి కోళ్లను చంపేశాయి. కొన్నికోళ్లు తప్పించుకుని పారిపోతుండగా వెంటపడి మరీ చంపేశాయి. ఈ సంఘటనతో 1,50,000 రూపాయలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని నర్సింలు కోరుతున్నాడు.

ముగ్గురిపై కేసు నమోదు

వీణవంక, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కనుకదుర్గా వైన్స్‌లో యజమానికి తెలియకుండా డబ్బులు వాడుకున్న వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఆవుల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. వైన్స్‌లో పనిచేస్తున్న గుర్రం దేవరాజ్, పూదరి రతన్, పచ్చిమట్ల శ్రీనివాస్ ఆరు లక్షల రూపాయలు దుర్వినియోగం చేసి సొంతానికి వినియోగించుకున్నారని వైన్స్ యజమాని సంపత్‌గౌడ్ ఫిర్యాదు చేశారని ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో

- ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ గ్రామ శివారులో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఆటో ఢీ కొట్టిన ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ములుగు జిల్లా ఆత్మకూరు మండలానికి చెందిన భాషబోయిన రాకేష్ ఆటోలో వేములవాడ దైవదర్శనానికి వెళ్లి సోమవారం అర్ధరాత్రి తిరిగి వస్తున్నారు. మార్గమధ్యలో తాడికల్ బస్టాండ్ దగ్గర ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో రాకేష్, రోజారమణికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది క్షతగాత్రులను అంబు లెన్స్‌లో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వ్యాపారులను బెదిరించిన వ్యక్తి అరెస్ట్



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణం కళ్యాణ్‌నగర్‌లోని పలువురు వ్యాపారులకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేసిన కేసులో గోదావరిఖని చంద్రశేఖర్‌నగర్ చెందిన యాదనవేణి తిరుపతి అనే వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. తిరుపతి కళ్యాణ్‌నగర్‌లో వ్యాపారుల వద్ద హమాలీగా పని చేస్తున్నాడన్నారు. వ్యాపారుల లావాదేవీలు గమనించిన తిరుపతి వారిని బెదిరించడం ద్వారా సులభంగా డబ్బులు సంపాదించవచ్చని ఆలోచన చేశాడు.

దీనిలో భాగంగా ఈనెల 18న కళ్యాణ్‌నగర్‌లోని ఇద్దరు వ్యాపారులకు ఫోన్ చేసి ఒక్కొక్కరు పది లక్షల రూపాయలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారన్నారు. తాను గతంలో చౌరస్తాలో రౌడీషీటర్ సుమన్‌ను హత్య చేశానని, మీకు అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే పదిలక్షల రూపాయలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశాడన్నారు. ఈ నెల 22న ఒక వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసుకొని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్ చేసిన వ్యక్తిని గుర్తించామన్నారు. మంచిర్యాల జిల్లా ఇందారం సమీపంలోని కన్నూరు గ్రామానికి చెందిన నిందితుడిని అరెస్ట్ చేశామని తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, బెదిరింపులకు పాల్పడినా ఉపేక్షించలేదని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్‌ఐ రమేష్‌ను ఆయన అభినందించారు.

ట్రాన్స్‌జెండర్‌తో వ్యక్తి సహజీవనం

- భార్య ఆత్మహత్యాయత్నం

- పోలీసులకు బంధువుల ఫిర్యాదు

జగిత్యాల అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్‌తో ఓ వ్యక్తి సహజీవనం చేస్తున్నాడని అతడి భార్య మంగళవారం జగిత్యాలలో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. జగిత్యాల పట్టణానికి చెందిన ఓ యువకుడికి సారంగాపూర్ మండలం పెంబట్లకు చెందిన ఓ యువతితో 11 సంవత్సరాల క్రితం వివాహం కాగా వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. దంపతుల మధ్య మనస్పర్థల కారణంగా వివాహిత కొంతకాలంగా పుట్టినింట్లో ఉంటోంది. దీంతో సదరు యువకుడు సోషల్ మీడియాలో పరిచయం అయిన హైదరాబాద్‌కు చెందిన ట్రాన్స్‌జెండర్‌తో కొన్నిరోజులుగా సన్నిహితంగా ఉంటున్నాడు.

ట్రాన్స్‌జెండర్‌ను జగిత్యాలకు తీసుకువచ్చిన యువకుడు ఆమెతో సహజీవనం చేస్తున్నాడు. దీన్ని జీర్ణించుకోలేని వివాహిత మంగళవారం పెంబట్లలో ఆత్మహత్యాయ త్నానికి పాల్పడింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను జగిత్యాల ఆసుపత్రికి తరలించగా ప్రాణాపాయం తప్పింది. భార్య ఆసుపత్రిలో ఉన్నా చూడడానికి రాకపోవడంతో అల్లుడి కోసం వెతుకుతూ అత్తామామలు జగిత్యాలలోని అతడి ఇంటికి వెళ్లారు. అక్కడ అల్లుడు ట్రాన్స్‌జెండర్‌తో కలిసి ఉండడాన్ని గమనించి ఆ గదికి తాళం వేసి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వారిద్దరినీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై విచారణ జరుపుతున్నామని జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు భారీ వరద

- ఈ సీజన్‌లోనే అత్యధికం - ఉదయం లక్ష క్యూసెక్కులపైగా ఇన్‌ఫ్లో - రాత్రికి 41,132 క్యూసెక్కులకు చేరిక



జగిత్యాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ప్రస్తుత సీజన్‌లో అత్యధికంగా వరద నీరు వస్తోంది. మంగళవారం ఉదయం లక్ష క్యూసెక్కులకు పైగా వచ్చిన వరద అనంతరం తగ్గి రాత్రి తొమ్మిది గంటల వరకు 41,132 క్యూసెక్కులకు చేరింది. కేవలం 24 గంటల వ్యవధిలో డ్యామ్‌లో సుమారు 10 టీఎంసీల నీరు వచ్చి చేరింది. దీంతో ఆయకట్టు పరిధిలోని అన్నదాతల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం వరదనీరు రావడం భారీ గా పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడం, విష్ణుపురి పరివా హక ప్రాంతం నుంచి గోదావరి నీరు ప్రాజెక్టు లోకి వస్తోంది. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీల సామర్థ్యానికి గాను ప్రస్తుతం 34.464 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టు లో 33.317 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 734 క్యూసెక్కుల నీటిని వదిలారు.

● ఒక్క రోజులోనే 10 టీఎంసీలకు పైగా...

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి ఒక్క రోజులోనే 10 టీఎంసీలకు పైగా వరద నీరు వచ్చి చేరింది. ఈనెల 28వ తేదీన ఉదయం ఆరు గంటలకు 26.415 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఈనెల 29వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు 36.464 టీఎంసీలకు నీరు నిల్వ పెరిగింది. ఎస్సారెస్పీ నీటి మట్టం వేగంగా పెరుగుతోంది. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి 75,648 క్యూసెక్కుల నీరు రాగా, మంగళవారం ఉదయం ఆరు గంటలకు 89,812 క్యూసెక్కులు, ఉదయం తొమ్మిది గంటలకు 1,05,000 క్యూసెక్కులకు పెరిగింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి వరద రాక స్వల్పంగా తగ్గుముఖం పట్టి 89,620 క్యూసెక్కులకు పడిపోయింది. మంగళవారం సాయంత్రం మూడు గంటలకు 67,401 క్యూసెక్కులు, సాయంత్రం ఆరు గంటల వరకు 64,345 క్యూసెక్కులు, రాత్రి తొమ్మిది గంటలకు 41,132 క్యూసెక్కులకు పడిపోయింది. ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరదనీరు వస్తుండడంతో ఆయకట్టు పరిధిలోని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా వరద నీటి ప్రవాహం మరో రెండు, మూడు రోజులు కొనసాగే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

బాలికపై అత్యాచారం: నిందితుడికి పదేళ్ల జైలు

జగిత్యాల క్రైం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ మరియు సెషన్స్ జడ్జి నారాయణ మంగళవారం తీర్పునిచ్చారు. ధర్మపురి పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి సంపంగి మహేష్(27)అనే యువకుడు 2022 సంవత్సరంలో అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి సీఐ కోటేశ్వర్, ఎస్సై కిరణ్‌కుమార్, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు శ్రీధర్, రాజు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లేశం కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి


వెంకటేష్ (ఫైల్)

కోరుట్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ద్విచక్ర వాహనం ఢీకొని షేర్‌దార్ వెంకటేష్ (44) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. వెంకటేష్ మధ్యాహ్న సమయంలో కాలినడకన కొత్త బస్టాండ్ నుంచి గంగంపేటలోని తన ఇంటికి వెళ్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమ మంగా ఉండడంతో కరీంనగర్ తరలిస్తుండంగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మేడిపల్లి మండలం వలంపల్లి గ్రామానికి చెందిన ముంజం కార్తిక్‌ను ప్రమాదానికి కారకుడిగా గుర్తించినట్లు ఎస్‌ఐ తెలిపారు. వెంకటేష్ కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఆస్తి తగాదాలో తండ్రిపై కత్తితో దాడి

రాయికల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదాలో రాయికల్ పట్టణంలో లక్ష్మీనర్సయ్య(55) అనే వ్యక్తిపై మంగళవారం రాత్రి కుమారుడు రాజేందర్ కత్తితో దాడి చేశాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాయికల్‌కు చెందిన చిట్యాల లక్ష్మీనర్సయ్యకు భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు కాగా కూతుళ్లకు వివాహం అయింది. కుమారుడు, భార్యతో గొడవల కారణంగా లక్ష్మీనర్సయ్య కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు.

ఇటీవల తన పేరు మీద ఉన్న భూమిని విక్రయించడానికి లక్ష్మీనర్సయ్య ప్రయత్నిస్తున్నాడని తెలుసుకున్న కుమారుడు రాజేందర్ మంగళవారం తన తండ్రి లక్ష్మీనర్సయ్యపై మరో వ్యక్తితో కలిసి కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలైన లక్ష్మీనర్సయ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై సుధీర్‌రావు పరిశీలించి విచారణ జరుపుతున్నారు.

గంజాయి పట్టివేత

ధర్మపురి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని రాయపట్నం శివారులో ఎస్సై ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ యువకుడి వద్ద 130 గ్రాముల గంజాయి మంగళవారం రాత్రి పట్టుకున్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలపై ఎలాంటి సమాచారం ఉన్న పోలీసులకు తెలుపాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

కేంద్రీయ విద్యాలయం నూతన భవనం ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



తంగళ్లపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులో అధునాతన హంగులతో నిర్మించిన పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం నూతన భవనాన్ని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. మంగళవారం ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్కూల్ ఇన్నోవేషన్ మార థాన్- 2025 కార్యక్రమంలో భాగంగా కేంద్రీయ విద్యాలయాన్ని కేంద్ర మంత్రి ప్రారంభించారు. వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకంతా మజుందర్, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్, కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరిలు పాల్గొన్నారు. ఆన్‌లైన్ ప్రారంభోత్సవాన్ని తిలకించేందుకు కేంద్రీయ విద్యాలయంలో స్క్రీన్ తదితర ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రారంభోత్సవం అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి మాట్లాడారు. కేంద్రీయ విద్యాలయంలో రీజినల్ అసిస్టెంట్ కమిషనర్ పి అనురాధ జ్యోతి ప్రజ్వలన చేశారు. అలాగే సీపీడబ్ల్యుడీ రమా వత్ సుఖియా, ప్రిన్సిపాల్ శేష ప్రసాద్, విద్యార్థులతో కలిసి ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెన్నమనేని శ్రీధర్‌రావు, సిరిసిల్ల వంశీ, ఇటికాల రాజు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రీజినల్ అసిస్టెంట్ కమిషనర్ అనురాధ

చల్లగ చూడు పోచమ్మ తల్లీ..

బద్ది పోచమ్మకు బోనం మొక్కులు చెల్లించిన భక్తులు



వేములవాడ కల్చరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పిల్లాపాపలు, పాడిపంటలను చల్లగా చూడు బద్దిపోచమ్మ తల్లీ.. అంటూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీరాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారికి ప్రీతిపాత్రమైన మంగళవారం భక్తులు ఉదయాన్నే మట్టి పాత్రాల్లో బోనం ఏర్పాటు చేసుకున్నారు. డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు. బద్ది పోచమ్మ అమ్మవారికి ఒడిబియ్యం, నూతన వస్త్రాలతో పట్నం వేశారు. నైవేద్యం సమర్పించి పిల్లాపాపలు, పాడిపంటలను చల్లగా చూడాలని వేడుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు క్యూలైన్‌లు త్వరగా కదిలేలా చర్యలు తీసుకున్నారు.



బోనాలతో బారులు తీరిన భక్తులు

రేపు గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్

గణేశ్‌నగర్,జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ మొదటి సంవత్సరానికి జోన్-3 (కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్ జిల్లాలు) పరిధిలోని గురుకుల కళాశాలల్లో పరిమిత ఖాళీల్లో ప్రవేశాలకు గురువారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జోనల్ ఆఫీసర్ కె.ప్రత్యూష ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ గ్రూపులలో (ప్రీమియర్ సీఓఈ అల్గునూర్ మినహా) కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఏ కళాశాలలోనైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, అనంతరం దరఖాస్తులు స్వీకరించరని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని, మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా సంబంధిత కళాశాలలో ఎంపిక ఉంటుందని తెలిపారు. వివరాలకు సమీపంలోని గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ సిబ్బంది భద్రతా పరికరాలను వాడాలి

టీజీ ఎన్‌పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ రెడ్డి

గణేశ్‌నగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సిబ్బంది భద్రతా పరికరాలను వాడాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని టీజీ ఎన్‌పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం కరీంనగర్ సర్కిల్ పరిధిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వినియోగదారులు, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను త్వరగా మరమ్మతు చేయాలన్నారు. విద్యుత్ చౌర్యాన్ని నివారించాలని, బకాయిలను వసూలు చేయాలని అన్నారు. అంకిత భావంతో పని చేసి సంస్థను అభివృద్ధిలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈ రమేష్ బాబు, డీఈలు తిరుపతి,లక్ష్మారెడ్డి, చంద్రమౌళి, రమణారెడ్డి పాల్గొన్నారు.

గురి చూసి.. విల్లు ఎక్కుపెట్టి..

- విలువిద్య శిక్షణలో విద్యార్థులు
- జాతీయ, రాష్ట్ర స్థాయిలో పతకాలు



శిక్షణ పొందుతున్న చిన్నారులు

సిరిసిల్ల టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విలువిద్య క్రీడకు ఒకప్పుడు జిల్లాలో ప్రాధాన్యం లేదు. ఖరీదైన క్రీడగా భావిస్తూ తల్లిదండ్రులు, పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు విలువిద్య (ఆర్చరీ)శిక్షణ ఇవ్వలేదు. మారుతున్న పరిణామాలతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో విలువిద్య నేర్చుకునేందుకు బాలబాలికలు ముందుకు వచ్చారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణిస్తూ పతకాలు తీసుకొస్తున్నారు. కోన రావుపేట మండలం నాగారం గ్రామానికి చెందిన బుర్రవేణి హరీష్ వ్యవసాయ కుటుంబంలో జన్మించాడు. మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు సహకారంతో చిన్ననాటి నుంచి కోచ్ వినోద్ ప్రోత్సాహంతో విలువిద్యలో శిక్షణ పొందాడు. 2012, 2013లో రాష్ట్ర స్థాయి విలు విద్యలో బంగారు, వెండి పత కాలను సాధించాడు.

యూనివర్సిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన విలువిద్య పోటీలలో 2016లో మచిలీపట్నం, 2017లో ఒడిశా, 2018లో భూపాల్‌లో జరిగిన జాతీయ స్థాయిలో బంగారు పతకాలతో పాటు ప్రశంసా పత్రాలను అందుకున్నాడు. ప్రస్తుతం ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించాలన్న లక్ష్యంతో తాను ప్రాక్టీస్ చేస్తూనే తనకు వచ్చిన విద్యను ఇతరులకు అందించాలన్న లక్ష్యంతో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో దాదాపు 20 మంది చిన్నారులకు ఉచితంగా విలువిద్య పై శిక్షణ ఇస్తున్నాడు. జాతీయ క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహించిన విలువిద్య పోటీలలో హరీష్ పాల్గొని జాతీయ స్థాయిలో 24వ ర్యాంక్ సాధించాడు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా స్పోర్ట్స్ (ఎన్‌ఐఎస్)లో ఒక సంవత్సరం డిప్లమా కోర్స్‌కు తెలంగాణ నుంచి హరీష్ ఒక్కడే ఎంపికయ్యాడు.



శిక్షణ ఇస్తున్న కోచ్ హరీష్

జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్న విద్యార్థులు

హరీష్ శిక్షణలో సిరిసిల్ల పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో పతకాలను సాధించారు. సిరిసిల్లకు చెందిన వి సుచిత్, శ్రీనిత్య తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలలో బంగారు పతకం సాధించారు. వి సుచిత్ 2023లో విజయవాడలో జరిగిన విలువిద్య అండర్-9 బాలుర విభాగంలో మినీ నేషనల్స్‌లో తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించాడు. అదే విధంగా శ్రీనిత్య 2024లో ఆంధ్రప్రదేశ్ గుంటూరులో నిర్వహించిన విలువిద్య అండర్ - 9 ఇయర్స్ బాలికల విభాగంలో మినీ నేషనల్స్ పోటీలో రాష్ట్రం నుంచి పాల్గొన్నది. సిరిసిల్ల కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న శివకృష్ణ చైతన్య విలువిద్య అండర్ -17 బాలుర విభాగంలో 2022లో మధ్యప్రదేశ్, 2023లో ఢిల్లీలో జరిగిన కేవీఎస్ సౌత్‌జోన్ పోటీలలో బంగారు పతకాలను సాధించి అబ్బురపరిచాడు. రిషిత్, వివేక్, నందన్‌సాయి, ప్రతీక్, అక్షరలను వివిధ విభాగాలలో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరుస్తూ పతకాలను అందుకున్నారు.

ఆసక్తితో విలువిద్య నేర్చుకుంటున్నాం
సుచిత్, సిరిసిల్ల



విలువిద్యపై ఆసక్తితో ప్రతిరోజు కోచ్ హరీష్ శిక్షణలో నైపుణ్యం సాధిస్తున్నాం. 2023లో విజయవాడలో జరిగి న విలువిద్య అండర్ - 9 ఇయర్స్ మినీ నేషనల్స్‌లో తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించాను. కానీ పతకం సాధించలేక పోవడం బాధించింది. ఈ సారి జాతీయ స్థాయిలో పతకం సాధించడానికి కష్టపడుతున్నాను.

విలు విద్య క్రీడను ప్రోత్సహించాలి
శివకృష్ణ చైతన్య, సిరిసిల్ల



జిల్లాలో విలువిద్యను ప్రోత్సహించాలి. క్రీడా నైపుణ్యం ఉండి చాలా మంది క్రీడాకారులు ఆర్థిక ఇబ్బందులతో ముందుకు రావడం లేదు. రాష్ట్రంలో మరిన్ని క్రీడా అకాడమీలు రావాలి. విలువిద్య అండర్ - 17 బాలుర విభాగంలో 2022లో మధ్యప్రదేశ్, 2023లో ఢిల్లీలో జరిగిన కేవీఎస్ సౌత్ జోన్ పోటీలలో బంగారు పతకాలను సాధించాను.

ఆసక్తితో నేర్చుకుంటున్నారు..
బుర్రవేణి హరీష్, క్రీడాకారుడు, శిక్షకుడు



విలువిద్యను పిల్లలు ఆసక్తితో నేర్చుకుంటున్నారు. తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. ప్రతిరోజు దాదాపు రెండు నుంచి మూడు గంటల సమయం శిక్షణ ఇస్తున్నాను. జాతీయ క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహించిన విలువిద్య పోటీలలో పాల్గొని జాతీయ స్థాయిలో 24వ ర్యాంక్ సాధించాను. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా స్పోర్ట్స్(ఎన్‌ఐఎస్)లో ఒక సంవత్సరం కాలం డిప్లమా కోర్స్ చేయనున్నాను. కోర్స్ పూర్తి చేశాక జిల్లా వ్యాప్తంగా విలువిద్యలో మరింత మందికి శిక్షణ ఇస్తా.

నవోదయ ప్రవేశపరీక్ష దరఖాస్తుల గడువు పొడిగింపు

చొప్పదండి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షకు దరఖాస్తు గడువును ఆగస్టు 13 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు కరీంనగర్‌లో గొర్రెల పెంపకందారుల మహాసభ

పెద్దపల్లి టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జగిత్యాల రోడ్డులో గల ఇందిరా ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 31న ఉదయం 11 గంటలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 18వ వార్షిక అత్యవసర మహాసభ జరగనుందని గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభ ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి కొత్తగా ఏర్పడిన జిల్లాలకు గొర్రెల పెంపకందారుల సహకార యూని యన్లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాటు ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఫిక్స్‌డ్ డిపాజిట్లను, వడ్డీ డబ్బులను జిల్లాలకు పంపిణీ చేసే ప్రక్రియను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ మహాసభ నిర్వహణకు కృషి చేసిన పెద్దపల్లి కలెక్టర్, జిల్లా పశువైద్యాధి కారికి, గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సలేంద్ర రాములు యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్మార్ మలేష్ యాదవ్, చిలారపు పర్వతాలు యాదవ్, రాష్ట్ర కార్య దర్శులు వేల్పుల నాగరాజ్ యాదవ్, ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, కాల్వ మల్లేశం యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాత రాజ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి మేకల నరసయ్య యాదవ్, ఉపాధ్యక్షుడు బత్తిని లక్ష్మణ్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మహాసభకు అందరు హాజరు కావాలని ఆయన కోరారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కోచ్ నరేశ్

నవోదయ రీజనల్ స్థాయి ఖో-ఖో పోటీలు ప్రారంభం

చొప్పదండి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి నవోదయ విద్యాలయంలో రీజనల్ స్థాయి 33వ ఖో-ఖో పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. దక్షిణ భారత దేశంలోని కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 77 నవోదయ విద్యాలయాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ పోటీలను ఖో-ఖో ఉమెన్స్ టీం వరల్డ్‌కప్ కోచ్ నరేష్, ప్రిన్సిపాల్ మంగతాయారు క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. అనంతరం అండర్-14, 17, 19 బాలబాలికల విభాగాల్లో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీకాళహస్తి, ఖో-ఖో అసోసియేషన్ రెఫరీస్ బోర్డు కన్వీనర్ వంగపల్లి సూర్యప్రకాశ్, పీఈటీలు వేణుగోపాల్, రాధిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్రీడీ కళకు యూకే పేటెంట్

రామగిరి, జూలై 29(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ త్రీడీ ఆర్టిస్ట్, మెకానికల్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్ఎస్ఆర్ కృష్ణ రూపొందించిన 10 త్రీడీ డిజైన్లకు యూకే పేటెంట్ దక్కింది. యుకేకి చెందిన అధికారిక ఇంటలెక్చువల్ ప్రాపర్టీ పేటెంట్ ఆఫీస్ 10 త్రీడీ డిజైన్స్ పేటెంట్ హక్కులను కృష్ణ పేరు మీదు నమోదైనట్లు లేఖ పంపారు. 14 సంవత్సరాలుగా త్రీడీ కళపై చేస్తున్న కృషికి గుర్తింపుగా తాను వేసిన త్రీడీ డిజైన్స్‌కి యూకే పేటెంట్ రావడంపై కృష్ణ గర్వంగా ఉందన్నారు. తనను ప్రోత్సహించిన మెకానికల్ ప్రొఫెసర్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ ఉదయ్ కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



త్రీడీ ఆర్ట్‌పై జేఎన్‌టీయూ ప్రిన్సిపల్ విష్ణువర్ధన్

మొక్కలు నాటి సంరక్షించాలి

- అధునాతన పద్ధతిలో గోశాల నిర్మాణానికి ఆమోదం
- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. శ్రీరాజరాజేశ్వర స్వామి తిప్పాపూర్ గోశాల ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గోశాలలోని కోడెలను పరిశీలించి పచ్చగడ్డిని అందజేశారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అడవుల విస్తీర్ణం తగ్గుతోందని, దీంతో వాతావరణ కాలుష్యం పెరుగుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు.

ఐఎస్‌వో సర్టిఫికేషన్ కోసం కృషి : కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

వేములవాడ శ్రీరాజారాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాలకు ఐఎస్‌వో సర్టిఫికెట్ వచ్చేలా కృషి చేస్తున్నామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. తిప్పాపూర్ గోశాల ఆవరణలో సివిల్ వర్క్స్ కొనసాగుతున్నాయని వాటిని విప్‌తో కలిసి పరిశీలించామని తెలిపారు. కోడెలకు పచ్చిగడ్డి సరఫరాలో ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.



మొక్కలు నాటుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

తెలంగాణపై వివక్ష చూపుతున్న బీజేపీ

మాజీమంత్రి, మాజీ ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి):కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతోందని మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓవైపు బీజేపీ పాలిత రాష్ట్రాలు గుజరాత్, మహారాష్ట్రతో పాటు కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింలు రిజర్వేషన్లు కల్పిస్తున్నారని, తెలంగాణ ముస్లింలకు కల్పించవద్దంటూ 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుకు అడ్డుపడుతున్నారని అన్నారు. బలహీన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్నారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

సాంకేతిక సమస్యలు ఎదురుకాకుండా డెడికేటెడ్ కమిషన్ సామాజిక వెనకబాటుకు గురవుతున్న వారు 56 శాతంగా పేర్కొనగా 42 శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు శాసన సభ, శాసన మండలిలో ఆమోదం తెలిపి, గవర్నర్ పరిశీలించి నివేదిక రాష్ట్రపతికి పంపారని, ఇప్పటికి ఎటువంటి నిర్ణయమూ ప్రకటించలేదని అన్నారు. ఏ బిల్లు అయిన రాష్ట్రపతి మూడు మాసాల్లో నిర్ణయం తీసుకోకుంటే అమలు చేసినట్లే అని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. హిందువులందరికీ రిజర్వేషన్ సౌకర్యం లేదని, సామాజికంగా వెనుకబడిన వారికి మాత్రమే రిజర్వేషన్ సౌకర్యం ఉందని, అలాగే ముస్లింలలో కూడా సామాజిక వెనుకబాటుకు గురవుతున్న వారికి రిజర్వేషన్ కల్పించడంపై అభ్యంతరమేమిటని అన్నారు.

బీజేపీ కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు మతపరమైన రిజర్వేషన్‌ల సుముఖంగా లేమని చెబుతున్నారని, మతపరమైన రిజర్వేషన్ సౌకర్యం కల్పనకు కాంగ్రెస్ సుముఖంగా లేదని. కాంగ్రెస్ అందిస్తున్న రిజర్వేషన్ కేవలం సామాజిక వెనుక బాటుకు గురవుతున్న వారికి మాత్రమేనని స్పష్టం చేశారు. 42 శాతం రిజర్వేషన్‌లలో 10 శాతం ముస్లింలకు కల్పిస్తున్నారనే వాదన తప్పుడు గా పేర్కొన్నారు. ప్రస్తుతం ఎస్‌సీ 15 శాతం, ఎస్టీ 10 శాతం, బీసీ 25 శాతం, ముస్లిం 4 శాతం మొత్తం 54 శాతం రిజర్వేషన్లు అమలు వుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన బీసీ రిజర్వేషన్ బిల్లులో బీసీలకు 42 శాతంతో పాటు ఎస్‌సీ, ఎస్‌టీలకు 25 శాతం కలిపితే మొత్తం 67 శాతం రిజర్వేషన్లు అవుతాయని, అయితే ఈ 67 శాతం రిజర్వేషన్ల నుంచి ఇప్పటి వరకు అమలవుతున్న 54 శాతం రిజర్వేషన్లను మినహాయిస్తే కేవలం 13 శాతం రిజర్వేషన్లు మాత్రమే పెరిగినట్లుగా వివరించారు. విద్య, ఉద్యోగాల్లో ఇప్పటి వరకు అమలు వుతున్న 54 శాతం రిజర్వే షన్లలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు ఉండగా ఇప్పుడు అదనంగా పెరిగిన 13 శాతం రిజర్వేషన్లలో జనాభా నిష్పత్తిలో పేద ముస్లిం లకు 1.08 శాతం మాత్రమే అదనంగా లబ్ధి చేకూరుతుందన్నారు. సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పశు వైద్యశాలలో అటెండరే వైద్యుడు

- ఖాళీగా ఉన్న అసిస్టెంట్ డైరెక్టర్, వైద్యుల పోస్టులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

కళ్యాణ్‌నగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని వెటర్నరీ ఆసుపత్రిలో అటెండరే పశువులకు వైద్యం అందిస్తున్నాడు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంతోపాటు చుట్టూ 40 గ్రామాలకు ఈ పశువైద్యశాల ఆధారం. 1988లో పాత మున్సిపల్ కార్యాలయం వద్ద అప్పటి పశువైద్యశాఖ మంత్రి సత్యనారాయణ వైద్యశాలను ప్రారంభించారు. అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారితోపాటు ఇద్దరు వైద్యులు, ఇద్దరు అటెండర్లు ఉండాల్సి ఉండగా ఆరు నెలలుగా అసిస్టెంట్ డైరెక్టర్, ఇద్దరు వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో అటెండరే ఆవులు, గేదెలు, మేకలు, పెంపుడు కుక్కలకు వైద్య సేవలు అందిస్తున్నారు. చుట్టు పక్కల 40గ్రామాల కోసం ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేయగా జనగామ, సుందిళ్ల, ఎల్కలపల్లి, ఖాజిపల్లి, పొరట్‌పల్లి నుంచి రైతులు పశువుల వైద్యం కోసం ఇక్కడికి వస్తుంటారు. 37 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఆసుపత్రి శిథిలావస్థకు చేరుకుంది.

చికిత్స కోసం కరీంనగర్‌కు : సాగర్

ఆసుపత్రిలో వైద్య సేవలు లభించక పెంపుడు కుక్కను కరీంనగర్‌కు తీసుకువెళ్లి చికిత్స చేయించాను. చికిత్స లభించక పశువులు మృత్యువాత పడుతున్నాయి. పశువైద్యశాలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలి.



ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ డైరెక్టర్, పశువైద్యుల కుర్చీలు

రేపు ఇసుక వేలంపాట

ఇల్లంతకుంట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రెవన్యూ అధికారులు పట్టుకున్న ఇసుకకు ఈనెల 31న వేలంపాట నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఫారూఖ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తరలిస్తున్న ఇసుకను పట్టుకొని మండలకేంద్రంలోని కార్యాలయ ఆవరణలో డంప్ చేసిన నాలుగు ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక వేలంపాటలో పాల్గొనాలంటే రూ వెయ్యి దరావత్తు చెల్లించాలని సూచించారు.

క్షేత్ర సందర్శన

ఇల్లంతకుంట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని పెద్దలింగాపూర్, అనంతారం గ్రామాలలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు క్షేత్రసందర్శన చేశారు. జిల్లెలలోని వ్యవసాయ కళాశాల విద్యార్థులు మంగళవారం వరి, మొక్కజొన్న, ప్రత్తి పంటలపై తెలుసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల ప్రొఫేసర్లు మధూకర్, సాయికుమార్, మండల వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి, విలాకర్, అర్చనలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

కేసీఆర్ కిట్ల పంపిణీ

ఇల్లంతకుంట, జూలై 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఒగులాపూర్, గూడెపుపల్లి, గాలిపెల్లి గ్రామాలలో మంగళవారం కేసీఆర్ కిట్లను జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు పంపిణీ చేశారు. కేవీఎన్‌రెడ్డి, బట్టు విజయ్, మల్లుగారి దేవేందర్‌రెడ్డి, ఆరె కొమురయ్య, మల్లయ్య, పాశం రాజిరెడ్డి, కెశవేని శ్రీనివాస్, ఎంద్ర కిషన్, వేణు, నరేష్, బాబు, మహిపాల్‌రెడ్డి, ఆనందరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సురేష్, రాజు, సంతోష్, రవీందర్‌రెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

మట్టి కుప్పలను తొలగించిన మున్సిపల్ కార్మికులు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

సిరిసిల్ల టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదకరంగా కంకర మట్టి కుప్పలు అనే శీర్షికను ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించగా మున్సిపల్ అధికారులు స్పందించారు. జిల్లా కేంద్రం పాత బస్టాండ్ చౌరస్తా నుండి సిరిసిల్ల - కరీంనగర్ వెల్లె రహదారి డివైండర్‌ను ఆనుకొని రోడ్డు మధ్యలో మున్సిపల్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య విగ్రహం ఏర్పాటుకు పిల్లర్ నిర్మాణం చేపట్టారు. కంకర, మట్టి కుప్పలను నిర్లక్ష్యంగా రోడ్డుపై వదలడంతో ప్రమాదకరంగా కంకర, మట్టి కుప్పలు కథనాన్ని ఆంధ్రజ్యోతి ప్రచురించడంతో మున్సిపల్ అధికారులు స్పందించి పారిశుధ్య కార్మికులతో రోడ్డుకు అడ్డంగా ఉన్న కంకర, మట్టి కుప్పలను తొలగించారు.

విద్యార్థులకు బూట్లు అందజేత

ఎల్లారెడ్డిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ది రాజేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బూట్లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్, ఫౌండేషన్ చైర్మన్ రాజేశ్, ప్రతినిధి సలెక్సాన్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతో పల్లెల అభివృద్ధి

ఎల్లారెడ్డిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులతో పల్లెలు ప్రగతిని సాధిస్తున్నాయని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లిలో ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నిధులతో తలపెట్టిన బోరు బావి తవ్వకాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణేశ్, నరేశ్, మహేశ్, కిషన్, బాలయ్య, చరణ్, తిరుపతి, బాలకృష్ణ, మల్లయ్య, శ్రీనివాస్, వినోద్, సంతోష్, బాలు, సతీష్, వెంకటేశ్, లింగయ్య పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

ఎల్లారెడ్డిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందిన రైతు ఎడ్ల బాలనర్సయ్య కుటుంబానికి సెస్ ద్వారా మంజూరైన రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును సెస్ డైరెక్టర్ కృష్ణహరి మంగళవారం అందజేశారు. మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, నాయకులు సుభాష్, మురళీమోహన్‌గౌడ్, రాజం, దేవరాజు, పర్శరాంరెడ్డి, అంజిరెడ్డి, బాల్‌రెడ్డి, వెంకటొరెడ్డి, నర్సింలు, సీత్యానాయక్, సత్తయ్య పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

చందుర్తి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అధునాతన సమాచారాన్ని పొందాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, కోఆర్డినేటర్ డాక్టర్ హరికృష్ణ అన్నారు. తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కరీంనగర్ వారి ఆధ్వర్యంలో మంగళవారం చందుర్తి మండలం ఆసిరెడ్డిపల్లెలో వ్యవసాయంలో డిజిటల్ అనువర్తనాలు మీద రైతు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తల బృందం రైతులు సాగు చేస్తున్న వరి, పత్తి పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రుద్రంగి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బొజ్జ మల్లేశం, మండల వ్యవసాయ అధికారిని అనూష, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రవీణ్, పంచాయతీ సెక్రటరీ మహేష్ ,రావెప్ విద్యార్థినులు, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చందుర్తి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రమేష్ అన్నారు. చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో సైబర్ నేరాలు, నకిలీ విత్తనాలపై, సీసీ కెమెరాల ప్రాముఖ్యలపై, స్థానిక సంస్థల ఎన్నికలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఏదైనా సైబర్ క్రైమ్ జరిగితే గోల్డెన్ హవర్‌లోనే ఫోన్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రంగస్వామి, కానిస్టేబులు గణేష్, సమీ, బాలయ్య పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఆవరణలో కూలిన వృక్షం

కోనరావుపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో వృక్షం అకస్మాత్తుగా కూలి రోడ్డుపైన పడింది. ఆ సమయంలో ప్రజలు ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రాకపోకలకు అంతరాయం ఏర్పడంతో గ్రామపంచాయతీ సిబ్బంది వృక్షాన్ని తొలగించారు.

మేజర్ పంచాయతీలో లోపించిన పారిశుధ్యం

ముస్తాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్యం లోపించిందని మండల బీజేపీ అధ్యక్షుడు సొల్ల క్రాంతి ఆవరణలో ఈవోకు వినతిపత్రాన్ని అందించారు. మండల ప్రధాన కార్యదర్శి ఏదునూరి గోపి, జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్‌రెడ్డి మెంగని మహేందర్, మీస శంకర్ పాల్గొన్నారు.

రేపు గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ఇల్లంతకుంట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో మిగిలిపోయిన సీట్లకు ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సంధ్యారాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హాజరయ్యే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో వచ్చి దరఖాస్తు చేసుకోవాలని, సాయంత్రం 4గంటలకు ఎంపికైన విద్యార్థుల జాబితా ప్రకటిస్తామన్నారు.

తంగళ్లపల్లి : మండలంలోని బద్దనపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల, కళాశాలలో ఈనెల 31న స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దర్శనల పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మధ్యాహ్నం 2గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తామన్నారు.

ముస్తాబాద్ : ముస్తాబాద్ సాంఘీక సంక్షేమగురుకుల కళాశాల (బాలుర)లో ఈనెల 31న ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లలో మిగిలిన సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ చేపడుతున్నట్లు ప్రిన్స్‌పాల్ ఎం ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

గంభీరావుపేట, జూలై 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్మాల గ్రామస్తులు మంగళవారం రాత్రి మహానంది అవార్డు గ్రహీతలైన బొంగు మల్లేశం, సంతోష్ చారీలను ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ రాజు, నాయకులు యాదిలాల్, రాజేందర్, అంజనేయులు, కిషోర్, వెంకటస్వామి, తదితరులు ఉన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

చందుర్తి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ తిరుపతి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 2003లో డీఎస్సీకి ఎంపికైన వారిని ఆలస్యంగా నియమించి పాత పెన్షన్ విధానానికి అనర్హులుగా ప్రకటించిందన్నారు. ఉపాధ్యాయుల సుదీర్ఘ పోరాటాల నేపథ్యంలో మంగళవారం హైకోర్టు తీర్పు హర్షనీయమన్నారు. ప్రభుత్వం అర్హులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి, కోర్టు తీర్పును స్వాగతించాలన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నేతలు

గంభీరావుపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) :హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కాంగ్రెస్ నేతలు మంగళవారం కలిసారు. కాంగ్రెస్ నాయకులు తిరుపతిగౌడ్, లక్ష్మీనారాయణ, బాలకిషన్ తదితరులు ఉన్నారు.

డబ్బులు అడిగితే ఇవ్వొద్దు

తంగళ్లపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయం పేరు చెప్పి ఎవరైనా డబ్బులు అడిగితే ఇవ్వవద్దని తహసీల్దార్ జయంత్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొంత మంది బ్రోకర్లు తహసీల్దార్ కార్యాలయం పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, ఎవరికి డబ్బులు ఇచ్చి మోసపోవద్దన్నారు. ఎవరైన డబ్బులు అడిగితే నేరుగా కార్యాలయానికి వచ్చి లేదా ఫోన్ ద్వారా సమాచారం అందించాలని పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ప్రారంభం

ఇల్లంతకుంట, జూలై 29(ఆంధ్రజ్యోతి) మండలంలోని వెల్జీపూర్ గ్రామం మీదుగా ఆర్టీసీ బస్సును నాయకులు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు గొల్ల కోమటి శంకర్, సీనియర్ నాయకులు గుండ వెంకటేశం, చిలువేరు స్వామిరెడ్డి, బొల్లారం పర్శరాం, మొగిల్ల బాబు, బొజ్జ శ్రీనివాస్, గుండ రవి, పందిల్ల యాదగిరి, మందాటి మహేష్‌రెడ్డి, కేసీరెడ్డి, నారాయణరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



రాచర్లగొల్లపల్లిలోని ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

ఎల్లారెడ్డిపేట, జూలై29(ఆంధ్రజ్యోతి): ఈ పాస్ యంత్రాలు, దుకాణాల్లోని ఎరువులు,మందుల నిల్వల్లో తేడాలు వస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్‌లోని ప్యాక్స్ ఆధ్వర్యంలోని గోదాం, ప్రైవేటు ఎరువులు, మందుల దుకాణాల్లో మంగళవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లోని రికార్డులు, ఎరువులు, మందుల నిల్వలు, అనుమతులు, విక్రయిస్తున్న మందులను పరిశీలించారు. గోదాంలో నిల్వ ఉన్న యూరియా బస్తాలను స్వయంగా లెక్కించారు. ఈ పాస్ యంత్రాలు, నిల్వలో తేడా రావడంతో ఇదేమిటనీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యత్యాసం వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులు, మందుల నిల్వల్లో తేడా రాకుండా దుకాణాలను నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించాలని చూడాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. అల్మాస్‌పూర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, వంట గది, తరగతి గదులు, కూరగాయాలు, భోజనం, రికార్డులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. భోజనం ఎలా ఉంటుందని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యాలయంలో అన్ అకాడమీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆన్‌లైన్ శిక్షణ తరగతుల వివరాలపై ఆరా తీశారు. తరగతి గదుల్లోకి వెళ్లి పలు ప్రశ్నలు వేసి విద్యార్థినుల ద్వారా సమాధానాలు రాబట్టారు. వెంట మండల ప్రత్యేక అధికారి అఫ్జల్‌బేగం, ఎంఈవో కృష్ణహరి, పాఠశాల ప్రత్యేక అధికారి అజంత ఉన్నారు.

చిన్నారులకు 'ప్రీ ప్రైమరీ'

(5వ పేజీ తరువాయి)

గదులకు రంగులు, అందమైన చిత్రపటాలు ఏర్పాటు చేయడంతో పాటు ఆట వస్తువులు, బొమ్మలను అందించనున్నారు. అంతేకాకుండా ప్రీ ప్రైమరీ విద్యార్థులకు ప్రభుత్వం ఒక్కోక్క విద్యార్థికి రూ.500 అందజేయనున్నది. రూ.250 స్టేషనరీ, రూ.100 నోటు పుస్తకాలు, రూ.150 చార్టు పేపర్ల కోసం వినియోగించనున్నారు. దీనికి సంబంధించిన నిధులను కూడా ప్రభుత్వం విడుదల చేసింది. ప్రీ ప్రైమరీ నిర్వహణకు ప్రత్యేకంగా కలెక్టర్ నేతృత్వంలో 18నుంచి 40ఏళ్ల మధ్య వయస్సు ఉన్న ఒకరిని ఉపాధ్యాయుడిగా తాత్కాలిక పద్ధతిలో నియమిస్తారు. కనీసం ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఉండాలి. మరొకరు ఆయా ఏడవ తరగతి చదివి ఉండాలి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పర్యవేక్షణలోనే ప్రీ ప్రైమరీ కొనసాగుతుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే స్నాక్స్‌తో పాటు మధ్యాహ్నం భోజనం అందిస్తారు.

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిన సినారె

వేములవాడ టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష ఔన్నత్యాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత వ్యక్తి, ఘనుడు సినారె అని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి అన్నారు. వేములవాడ మండలం నందికమాన్ వద్ద రెడ్డి భవన్‌లోని సినారే జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మనోహర్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషా వికాసానికి విశేష కృషి చేసిన ఆదర్శమూర్తి సినారె అని అన్నారు. తెలంగాణ జాతికి గర్వకారణమని, తెలుగు కవిత్వానికి కీర్తితోరణంగా నిలిచిన కవి, రచయిత, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, సాహితీ దిగ్గజం సింగిరెడ్డి నారాయణ రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల నాగిరెడ్డి, గడ్డం సత్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా సినారె జయంతి

ఎల్లారెడ్డిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కవి, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి నారాయణరెడ్డి జయంతి వేడుకలను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని తాజా, మాజీ జడ్పీటీసీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మహోన్నత సాహితీ శిఖరం సినారె జీవితం అందరకీ ఆదర్శనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ కృష్ణహరి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, నాయకులు సుభాష్, సందీప్, మురళీమోహన్‌గౌడ్, సీత్యానాయక్, రాజం, నర్సింలు, వెంకటొరెడ్డి, దేవరాజు, బాల్‌రెడ్డి, అజిమోద్దిన్, దర్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బోయినపల్లి మండలకేంద్రంలో నూతన రేషన్ కార్డులతో పాటు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు కలెక్టర్ సందీప్ కుమార్ యాదవ్ కలిసి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ కార్డు జారీ నిరంతరంగా కొనసాగుతుందన్నారు. బోయినపల్లి మండలంలో 1070 పేద కుటుంబాలకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని, అదే సమయంలో ప్రస్తుతం ఉన్న 1971 రేషన్ కార్డులలో కొత్త సభ్యులను జమ చేస్తున్నమన్నారు. నూతనంగా దాదాపు 6000 మంది ప్రజలకు రేషన్ అందనున్నందని కలెక్టర్ తెలిపారు. ప్రజల జీవనంలో రేషన్ కార్డు చాలా కీలకమైన డాక్యుమెంట్ మని కరెంట్ కనెక్షన్, ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అనేక కార్యక్రమాలకు రేషన్ కార్డు ఉపయోగ పడుతుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, ఎవరైనా అర్హులు దరఖాస్తు చేసుకుంటే వెంటనే పరిశీలించి రేషన్‌కార్డు మంజూరు చేస్తామన్నారు. అనంతరం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, రేషన్ కార్డు పేద ప్రజల జీవితంలో చాలా కీలకమైన పాత్ర పోషిస్తుందని అన్నారు. పది సంవత్సరాలుగా ఒక పేద కుటుంబానికి రేషన్ కార్డు, ఇండ్లు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు చేస్తున్నామన్నారు. నూతన రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో బోయిన్‌పల్లి మండలంలో అత్యధికంగా ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రేషన్ కార్డుతో 9రకాల వస్తువులు ఇచ్చామని, గత పాలకుల హయాంలో ఆ సామగ్రిని రద్దు చేశారన్నారు. ముఖ్యమంత్రి, కలెక్టర్ ఎటువంటి బియ్యం తింటారో పేద ప్రజలకు కూడా అటువంటి సన్నబియ్యం రేషన్ కార్డు ద్వారా సరఫరా చేయడం ఉగాది నుంచి ప్రారంభించామని, దీనితో రేషన్‌కార్డు ప్రాముఖ్యత గణనీయంగా పెరిగిందన్నారు. అనంతరం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రజిత, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీవో జయశీలా, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేశ్ యాదవ్, వైస్‌చైర్మన్ వినోద్‌రెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ వేణుగోపాల్, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతి గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు వెన్నెల రమణారెడ్డి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవిందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రేషన్ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యం

కార్యకర్తలకు అండగా ఉంటాం..

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

సిరిసిల్ల టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తలకు అండగా ఉంటామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, బోయినపల్లి మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులతో కేటీఆర్ సమావేశాలను నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులు సమన్వయం ఐక్యతతో పనిచేస్తూ స్థానిక సంస్థల ఎన్నికలలో గులాబీ జెండాను ఎగరవేయాలన్నారు. సిరిసిల్లలో పార్టీని ఓడించే వారేలేరని కాంగ్రెస్ బీజేపీ పార్టీలకు అభ్యర్థులే కనబడడం లేదన్నారు. మెజార్టీ స్థానాలను గెలిచి అధికారాన్ని తిరిగి సాధించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధిస్తే ప్రజలను పార్టీ శ్రేణులను ఇబ్బందికి గురిచేస్తున్న ప్రభుత్వ అధికారులంతా సహకరిస్తారన్నారు. పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడం కోసం స్థానిక ఎమ్మెల్యేగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గత 20 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని విస్మరించి అవినీతి అరాచకాలకు తెరలేపిందని ఆరోపించారు. రైతులకు, నిరుద్యోగులకు, వృద్ధులకు, నిరుద్యోగులకు, మహిళలకు ఇచ్చిన హామీలను కూడా విస్మరించి ఉత్తమాటలతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలం గడుపుతుందని మండిపడ్డారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని ఓట్ల సమయంలో రైతు బంధు ఇస్తుందని అన్నారు. వ్యవసాయం బాగుండాలంటే మళ్లీ కేసీఆర్ రావాలని రైతులు అభిప్రాయపడుతున్నారని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం యువతను, విద్యార్థులను మోసం చేసిందని, ఆడపిల్లలకు స్కూటీలు, నిరుద్యోగులకు భరోసా ఇవ్వకుండా మోసం చేసిందని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరు చెప్పి మిగిలిన హామీలన్నింటిని ఎగ్గొట్టిందని విమర్శించారు. ప్రజలందరికి కాంగ్రెస్ ప్రభుత్వంపై కోపం పెరిగిందని రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్‌కు గట్టి బుద్ధి చెబుతారని ధీమాను వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలతో పాటు బీసీలను కూడా మోసం చేసిందిని బీసీలకు రిజర్వేషన్ పేరుతో జరుగుతున్న మోసంను బీసీలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గడప గడపకు పార్టీ కార్యకర్తలు తీసుకెళ్లాలని సూచించారు. పల్లెలో మౌళిక సదుపాయాలు, వసతుల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామాల్లో డీజిల్ కూడా కొనుగోలు చేయలేని పరిస్థితులు ఏర్పాడ్డాయన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లెలు జాతీయస్థాయి అవార్డులు గెలుచుకున్నాయని గుర్తుచేశారు. సిరిసిల్ల ఎట్లా అభివృద్ధి చెందిందో ప్రతి ఒక్కరు చూస్తున్నారని కేటీఆర్ అన్నారు.

రామన్న జపమే..

రాష్ట్రమంతా రామన్న(కేటీఆర్) జపమే చేస్తున్నారని సిరిసిల్ల నియోజకవర్గంలో రామన్నకు ఓటమి లేదని మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో మనం గెలిస్తే కాంగ్రెస్ ఇందిరమ్మ కమిటీలే ఉండవన్నారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి సిరిసిల్ల గడ్డపై గులాబి జెండ ఎగరవేయాలన్నారు.

రాష్ట్రంలో అసమర్థ పాలన..

తెలంగాణ రాష్ట్రంలో అసమర్థ పాలన నడుస్తుందని బోయినపల్లి మాజీ ఎమ్మెల్యే రవి శంకర్ అన్నారు. కేసీఆర్ పాలనలో ఇంటింటికి సంక్షేమ పథకాలు అందాయని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో స్థానిక సంస్థల ఎన్నికలలో ఐక్యంగా కొట్లాడి రాష్ట్రంతో పాటు సిరిసిల్లలో గులాబీ జెండాను ఎగరవేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా వచ్చే పరిస్థితులు లేవన్నారు. అంతకు ముందు తెలంగాణ భవనంలో సింగిరెడ్డి నారాయణరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్, నాయకులు సీనారే చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్లు తుల ఉమ, నాల్యకొండ అరుణరాఘవరెడ్డి, నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, కుంభాల మల్లారెడ్డి, పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల అందజేత

సిరిసిల్ల రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు బాబాజీ నగర్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారుచేసే కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన మూడు గ్యాస్ సిలిండర్‌లను మంగళవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చేన్నమనేని కమలాకర్‌రావు మధ్యాహ్న భోజనం కార్మికులకు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాళ్లపల్లి బాలరాజు, గుగ్గిళ్ల తిరుపతి ప్రధానోపాధ్యాయలుగడ్డం శంకర్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, తిరుపతి, లక్ష్మీ, స్థానికులు ఉపేందర్, చల్లరాము, నాంపెల్లి, కాసారం ఎల్లయ్య, తిమ్మనగరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు దశలవారీగా నిధులు

కోనరావుపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఖాతాల్లో దశలవారీగా డబ్బులు జమవుతున్నాయని ఇందిరమ్మ కమిటీ సభ్యులు అన్నారు. మంగళవారం నిమ్మపల్లిలో 51 మంది పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా, 31 ఇల్లు నిర్మిస్తున్నారని అన్నారు. మల్యాల మనోజ్ కుమార్, దర్ర రవి, కర్ల రాజేశం, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు ఎండీ అజీమ్ ఫాషా, బాశెట్టి నాగరాజు, పంచాయితీ కార్యదర్శి అనిల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పెంతల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ, తదితరులు పాల్గొన్నారు.

'అండగా నిలవడానికి ప్రజలు సిద్ధం'

ఇల్లంతకుంట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ అండగా నిలవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో మంగళవారం మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, కిసాన్‌మోర్చా నాయకుడు కరివెద మహిపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకట్‌రెడ్డి, నాయకులు సొల్లు అజయ్‌వర్మ, అడిచర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై నిఘా పటిష్టం

సిరిసిల్ల క్రైం, జూలై 29(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణాపై నిఘా పటిష్టం చేశామని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గంజాయి కేసులో చేదనలో ఉత్తమ కనబరిచిన సిబ్బందికి మంగళవారం ఎస్పీ ప్రోత్సాహకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆరునెలల వ్యవధిలో 37కేసులలో 95మంది అరెస్టుచేసి 3,500 గ్రాముల గంజాయి, 12గంజాయి చెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆలేరు వద్ద రోడ్డు ప్రమాదం.. ఏడుగురికి గాయాలు

సిరిసిల్ల క్రైం, జూలై 29(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో సిరిసిల్లకు చెందిన ఏడుగురు భక్తులకు తీవ్రగాయాలయ్యాయి. సిరిసిల్ల నుంచి యాదాద్రి నర్సింహాస్వామి దేవస్థానంనకు వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. యాదాద్రి నుండి తిరిగి సిరిసిల్లకు వస్తుండగా ఆలేరు హైవేపై వంతెన నిర్మాణం వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో సిరిసిల్లకు చెందిన విశ్వనాథం, గంగాధర్‌రావులతో పాటు మిగితా భక్తులకు తీవ్రగాయాలయ్యాయి. తీవ్రగాయాలైన వారిని చికిత్స కోసం వెంటనే స్థానికులు జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా నాగుల పంచమి

- కిటకిటలాడిన దేవాలయాలు
- పుట్టల వద్ద మహిళల ప్రత్యేక పూజలు

సిరిసిల్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం శుక్ల నాగపంచమి పర్వదినం సందర్భంగా సిరిసిల్లలోని దేవాలయాలు కిటకిటలాడాయి. మంగళవారం ఉదయం నుంచే మహిళలు వివిధ దేవాలయాల ఆవరణలోని పాము పుట్టల వద్ద నాగారాధన చేశారు. సిరిసిల్లలోని శివాలయం ఆవరణలో నాగదేవతకు మహిళలు బారులు తీరి పూజలు నిర్వహించారు. సాయిబాబా, అయ్యప్ప, మడేళేశ్వరస్వామిల ఆలయాల్లో మహిళలు పూజలు నిర్వహించారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో నాగుల పంచమిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని నాగదేవత విగ్రహాల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలో పాలు పోసి నైవేద్యం సమర్పించారు.

● వేములవాడ కల్చరల్ : వేములవాడ పట్టణంతోపాటు, మండలంలోని ఆయా గ్రామాల్లో నాగ పంచమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని సాయిబాబ ఆలయంలోని పుట్ట వద్దకు, తిప్పాపూర్, నాంపల్లిల్లో పాలు పోసేందుకు భక్తులు తరలివచ్చారు.

● ఇల్లంతకుంట : మండలంలో నాగుల పంచమి వేడుకలు జరిగాయి. మండలకేంద్రంలోని గంగాధర ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు మూగు నాగరాజుశర్మ, నాగలింగం పంతులు, మహిళలు పాల్గొన్నారు.

● చందుర్తి : మండలంలో నాగుల పంచమి వేడుకలను భక్తిశ్రద్దలతో జరుపుకున్నారు. మూడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో, మర్రిగడ్డలోని ఎల్లమ్మ ఆలయంలో పుట్టలో పాలు పోసి పూజలు నిర్వహించారు. మాజీ ప్రజాప్రతినిధలు సిరికొండ ప్రేమలత, పులి రేణుక, పాల్గొన్నారు.

● రుద్రంగి : మండలంలో నాగుల పంచామి వేడుకలు ఘనంగా జరిపారు. గండి వేంకటేశ్వర్లు ఆలయం, శివాలయంలో ఉన్నటువంటి పుట్టల వద్ద పాలు పోసి నాగదేవతకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో నాగుల పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎల్లమ్మ గుడి, నాగదేవత ఆలయాలు, పుట్టల వద్ద బారులు తీరి మొక్కులు చెల్లించుకున్నారు.



సిరిసిల్లలో పాలు పోస్తున్న మహిళలు



వేములవాడలో పాలు పోస్తున్న మహిళలు